# చదరంగం

'ఇక మీ రాజు ఆట కట్టు' రూక్‌ని రాజు పక్కగడిలోకి జరుపుతూ అన్నాడు మనోహర్. రెండు రూక్‌లు, ఒక క్వీన్‌తో పకడ్బందీగా బంధించేశాడు - తన రాజుని. యిది మూడోసారి ఓడిపోవటం. మృదుల ఛెస్ బోర్డు వైపు విసుగ్గా - తన రాజువైపు జాలిగా చూసిందో క్షణం.... చెక్కతో చేసిన ఆ రాజుకి ప్రాణం ఉన్నట్లే అన్పిస్తుంది తనకు. తన అసమర్థత, బుద్ధిహీనతవల్లనే ఓడిపోయి - తనవైపు దీనంగా చూస్తున్నట్లు.. గిల్టీగా ఉంది ఎందుకో......

తలయెత్తి మనోహర్ వైపు చూసింది. వత్తుగా - నల్లగా - వంకీలు తిరిగిన జుట్టు, చిలిపిగా నవ్వే కళ్ళు, అందమైన మీసకట్టు, ముద్దాడాలనిపించే పెదాలు, బలిష్ఠమైన బాహువులు....

ఓసారి ఆ బాహుబంధంలో నలిగిపోతే.....

తల విదిలింపుతో పాటు ఆ భావాన్ని కూడా విదిలించి వేసింది మృదుల.

"ఏవిటి ఎనీథింగ్ రాంగ్?" మనోహర్ లో నిజమైన కన్‌సర్న్.

"కొద్దిగా తలనొప్పిగా ఉంది" తల రుద్దుకుంటూ అంది.

"రాజశేఖర్‌గారు లేకపోబట్టి అనుకుంటా - ఈ సారి ఎన్నాళ్ళు టూర్?"

మనోహర్ సెక్సీగా నవ్వాడు. మగవాళ్ళు యింత సెక్సీగా నవ్వగలరనీ యింత ఇర్రెసిస్టిబుల్‌గా ఉండగలరని తనకింతకు ముందు తెలియదు.

"కనీసం రెండు వారాలు పడ్తుంది" మృదుల అయిష్టంగానే లేచి నిలబడింది. మనసులోని చీకటి పొరల్లో ఎక్కడో ఓ మూల మనోహర్ తన ఎదురుగా మరికొంత సేపు ఉంటే బావుంటుందన్న కోరిక పాము పడగలా విచ్చుకుంటోంది. కానీ....

"మరలా ఒంటరితనంతో రెజిలింగ్ మొదలన్మాట" అదోరకంగా చూస్తూ అన్నాడు మనోహర్.

అందులో ఎగతాళి ఉందా? కవ్వింపు ఉందా ? లేక క్యాజువల్‌గానే అన్నాడా? ఓక్షణం మాత్రమే ఆలోచించి చెప్పింది. "ఒంటరితనం ఎందుకు? మీరున్నారుగా తోడు".

మనోహర్ మొహంలో ఛెస్ గెలిచినప్పుడు కదులాడే సంతృప్తితో కూడిన నవ్వు. అంతర్గతంగా ఉండే కిల్లర్ యిన్‌స్టింక్ట్‌ని శాంతపర్చుకున్నాక ప్రచ్ఛన్నమయ్యే భావం.

మనోహర్ లేచి నిలబడ్డాడు.

దాదాపు ఆరడుగుల పొడవు - విశాలమైన ఛాతీ - సన్నటి నడుం - మృగరాజుకున్నట్లు-

"రంజని ఎదురుచూస్తూ ఉంటుంది. మరలా రేపు కలుద్దాం" తమాషాగా కళ్ళతోనే బై చెప్పి వెళ్ళిపోయాడు మనోహర్.

మృదుల తలనొప్పి విపరీతంగా పెరిగింది. అమృతాంజన్‌కూ, అల్ట్రాజిన్ మాత్రలకు లొంగని తలనొప్పి - మనోహర్ నిష్క్రమణ ఎగదోసిన తలనొప్పి.

అపుడే చీకట్లు ముసురుకుంటున్నాయి. తన జీవితంలోలా - తనకు చీకటంటే భయం. స్విచ్ వేసింది మృదుల. గదినిండా వెల్తురు పర్చుకుంది. తనను భయపెట్టిన అస్పష్టమైన, వికృతమైన రూపాలు సీలింగ్‌పైన పడ్తున్న బల్బ్ నీడల్లో మిళితమై పోయాయి.

నిద్రకోసం స్ట్రగుల్ -మృదుల అసహనంగా మంచంమీద కదులుతోంది. పరుపు మెత్తగా, హాయిగా ఉండాల్సింది పోయి కుంపటిలా ఉంది. రాత్రి పది దాటింది. ఎంత ప్రయత్నించినా నిద్ర రావటం లేదు. మనోహర్ ఆరడగుల విగ్రహం, అందమైన నవ్వు, కళ్ళల్లో కవ్వింపు యివే గుర్తుకు వస్తున్నాయి.

మనోహర్, రంజని వాళ్ళది కొత్తకాపురం. ఓ మూణ్ణెల్ల క్రితం తమ పక్క పోర్షన్ అద్దెకు తీసుకున్నారు.

చూడముచ్చటగా - మేడ్ ఫర్ ఈచ్ అదర్‌లా వుండే ఆ జంటని చూసినపుడు, వాళ్ళ అల్లరి, ఆటలు, ఆరాటం చూసినపుడు - తన పెళ్ళినాటి మొదటిరోజులు గుర్తుకు వస్తాయి.

పెళ్ళయిన మూడేళ్ళకే ఎన్ని మార్పులు - అంతా మెకానికల్‌గా -టైంపాస్‌కోసం ఏదో ఓ పుస్తకం పేజీలు అనాసక్తితో తిరగేసి గిరాటేసినట్లు - ఎంతటి నిర్లక్ష్యం.

పెళ్ళయిన కొత్తల్లో పగలూ రాత్రి తేడానే తెల్సేది కాదు. ఆఫీసు, క్యాంపులూ అన్నీ మానేసి తనని మురిపించేవాడు రాజశేఖర్. ఇపుడు ...ప్చ్.. ఓ వేడి నిట్టూర్పు గుండెల్ని కాలుస్తూ వెలువడింది.

తనలో అందం, ఆకర్షణ తగ్గిందేమో - ఆ ఆలోచనకే నవ్వొచ్చింది మృదులకు. తను షాపింగ్‌కని వెళ్ళినపుడు తన శరీరాన్ని కళ్ళతో జుర్రుకునే వేల మనుషులు గుర్తొచ్చారు. తన గుండెల్ని చూపుల్తో తడిమే లక్షల కళ్ళు గుర్తుకు వచ్చాయి. ట్రాష్ - తను ఓ బిడ్డకు తల్లి అయాకే మరింత అందంగా తయారయింది. శరీరంలో కొత్త నిగారింపు - వంపుల్లో సెలయేటి హొయలు - నడకలో హుందాతనం - రూపంలో నిండుతనం వచ్చాయి.

మృదుల లేచి ఫ్రిజ్‌లోని నీళ్ళు త్రాగింది. చల్లగా, హాయిగా వుంది. నిలువుటద్దం ముందుకెళ్ళి నిలబడింది. కళ్ళు మందార పూలల్లా ఎర్రజీరల్ని పులుముకున్నాయి. నాసికాగ్రం వేడి నిశ్వాసలకు కమిలినట్లు కన్పిస్తుంది. అదిరే పెదాలు ..... వేగంగా కొట్టుకునే గుండెలు.... ఆ అద్దంలో పొడుచుకు వచ్చినట్లు బిగువుగా, ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి.

అందుకే రంజనిలాంటి అందమైన యిరవై దాటని వయస్సున్న భార్య ఉన్నా మనోహర్ తనవైపు ఆకర్షితుడవుతున్నాడు. తన పొందుకోసం ప్రాకులాడుతున్నాడు.

గర్వంతో కూడిన మందహాసం ఆ అద్దంలో ఫ్లాష్‌లా వెలిగిందో క్షణం. భార్య ఉన్నా ఓ పురుషుడు తన కోసం ఆరాటపడ్తున్నాడంటే స్త్రీలోని ఈగో సంతృప్తిపడుతుంది. అది తనలోని స్త్రీత్వం యింకా వసంత ఋతువులోనే ఉందనటానికి గుర్తు - తనలో ఇంకా అణగని పరువాల పొగరుకి పొందే మొమెంటో....

గడియారం పదకొండు గంటలు కొట్టింది. విసుగ్గా చూసింది మృదుల గడియారం వైపు. ఎంత క్రూరమైందీ సమయం! ఒకో క్షణమూ తన శరీరం పైనించి యినుప పాదాల్తో నడిచి వెళ్తున్నంత బాధ...

ఒక వేలియం వేసుకుని, మంచంమీద నడుంవాల్చి కళ్ళు మూసుకుంది.

"స్.. మెల్లిగా-ఏమిటా తొందర"

అది రంజని గొంతు. ఆ గొంతులో జీర... మత్తుగా..

మృదుల వాళ్ళ పడగ్గదికీ - మనోహర్ వాళ్ళ పడగ్గదికీ మధ్య తలుపొకటే అడ్డం.

ఎంత వద్దనుకున్నా మాటలు - శబ్దాలు విన్పిస్తున్నాయి.

"అబ్బ - అంత గట్టిగానా - మొరటు బాబూ" రంజని మూల్గుతోంది.

కనుల ముందు జరుగుతున్నట్లె మనసులో కదుల్తున్నాయి దృశ్యాలు. శరీరం జ్వలిస్తున్న చితిలా ఉంది. కోరిక బుసకొడ్తున్న నాగులా ఉంది.

తన భర్తపైన ఆ సమయంలో ఎక్కడ లేని కోపమూ - అసహ్యమూ కలిగాయి. తన కంటూ కొన్ని కోరికలు, అవసరాలు ఉంటాయని గుర్తించని ఆ మగాడు మగాడేనా - ఛీ - ఏం బ్రతుకిది - అడవిగాచిన వెన్నెల్లా తన అందం - పిచ్చివాడిచేతిలోని పరిమళభరితమైన పుష్పంలా తన నిండు యవ్వనం.

గుండె సలుపుతున్నట్లనిపించింది. ఒక్కసారి-ఒకే ఒక్కసారి మనోహర్ బలమైన చేతుల మధ్య....

పక్కన పడుకున్న పాప కదలి నిద్రలో ఓ చేయి మృదుల మీద వేసింది.

ఉలిక్కిపడి మృదుల తన కూతురివైపు చూసింది. నిద్రలోనే నవ్వుకుంటోంది పాప. రెండేళ్ళ తన గారాల కూతురు. అచ్చం తన భర్తపోలికే - అలా నవ్వుతుంటే తన భర్త నవ్వుతున్నట్లే ఉంది. స్వచ్ఛంగా - నిర్మలంగా -

"యింకోసారా - వుహూ - చాలు" రంజని గారాలుపోతూ మాట్లాడుతోంది.

"ప్లీజ్ రంజూ" ఫ్రిజిడిటీఉన్న స్త్రీని సైతం మైనంలా కరిగించే శక్తినంతా నింపుకున్న మనోహర్ గొంతు.

మృదుల లేచి టేప్ రికార్డర్ ఆన్ చేసింది. తన భర్త కిష్టమైన ముఖేష్ పాటలు - మంద్రంగా-

తన కూతుర్ని దగ్గిరగా హత్తుకుని కళ్ళు మూసుకుంది. మృదుల నిద్రపోయిన చాలా సేపటికి ఆటో ఆఫ్ ఉన్న టేప్ రికార్డర్ ఆఫ్ అయింది.

☆☆☆

"ఈ చీరలో అద్భుతంగా ఉన్నారు" మెచ్చుకుంటున్నట్లు చూశాడు మనోహర్.

ఆదివారం సాయంత్రం-యిద్దరూ ఛెస్ బోర్డు దగ్గిర కూచున్నారు.

మృదుల మృదువుగా నవ్వింది.

మనోహర్ చూపు గుండెల ఎత్తులమీద వత్తుకుంటోంది. గుండె వేగంగా కొట్టుకోవటం తనకు తెలుస్తూనే ఉంది.

'షా' చెప్పింది మృదుల తన క్వీన్‌తో.

"అదేమిటి - నాకు షా చెప్పే తొందరలో మీ క్వీన్‌ని నాకు సమర్పించుకుంటున్నారు. క్వీన్‌ని లొంగదీసుకున్నాక యింక రాజు పని పట్టడం ఎంతసేపు" మనోహర్ తన గుర్రంతో రాణిని తీసేశాడు.

మృదుల బేలగా చూసింది. అక్కడ గుర్రం పొంచి ఉండటం తను గమనించనేలేదు.

"పరధ్యానంగా ఉన్నారెందుకు" మృదుల చేతిని తను చేతుల్లోకి తీసుకున్నాడు మనోహర్.

బంగారుతీగల్లా నాజూకైన వేళ్ళు మనోహర్ చేతిలో నలుగుతున్నాయి.

"ఐ లవ్ యూ" మృదుల కళ్ళల్లోకి చూస్తూ మెల్లిగా చెప్పాడు.

ఆ మూడు పదాల వాక్యం - మధురమూ మనోహరమూ అయిన రాగంలా - వసంతం వరించిన వనంలో విన్పించే భ్రమర నాదంలా - తేనెధారలా - అమృత పానంలా - ఓహ్ - ఎంతటి తన్మయత్వం...

మృదుల కళ్ళు అనాయాసంగానే అరమోడ్పులయ్యాయి.

"రేపు రంజని వూరెళ్తోంది. తన పుట్టింటికి... ఓ వారం వరకూ బ్రహ్మచారినే. రేపు రాత్రి మీ కోసం ఎదురుచూస్తుంటాను"

మృదుల సమాధానం కోసం ఆగి - మరలా చెప్పటం ప్రారంభించాడు.

"మిమ్మల్ని చూసిన క్షణమే మనసు పారేసుకున్నాను. మీ గురించి ఆలోచిస్తూ ఎన్ని నిద్రలేని రాత్రుళ్ళు గడిపానో - నాకు రంజని ఎదురుగా ఉన్నా మీరే గుర్తుకు వస్తారు. నా

ప్రాణంలో ప్రాణం మీరు, నా వూపిరి, శ్వాస మీరు..... నా ప్రణయ దేవత మీరు"

మృదులకు మత్తుగా - హాయిగా ఉంది. తనకు పదహారేళ్ళయినట్లు - కాలేజీకి సీతాకోకచిలుకలా సింగారించుకుని పోతున్నట్లు మనోహర్ తన ప్రేమ పూజారి అయినట్టు -

"మీ పొందు దొరక్కపోతే బ్రతకలేననిపిస్తోంది. మీ కృపావీక్షణం కోసం ఇన్నాళ్ళ నా నిరీక్షణ రేపు ఫలిస్తుందని ఆశిస్తున్నాను"

మృదుల మౌనంగా వున్నా - మనసు అంగీకారంతో బదులిస్తూనే వుంది.

మనోహర్ మృదుల చేతిని తన పెదాలకు ఆనించుకున్నాడు. తేమగా - నులి వెచ్చగా - ఉద్వేగంతో కొద్దిగా అదురుతూ -

మృదుల తన చేతిని అయిష్టంగానే లాక్కుంది. తనువంతా తీయని పులకింత.

మనోహర్ మృదుల చేతిని బలంగా ఒకసారి నొక్కి వదిలేశాడు.

"రేపు రాత్రి మీ కోసం నా హృది తలుపులు - గది తలుపులు తెరిచి మీ పాదస్పర్శ కోసం ఎదురు చూస్తుంటాను"

మనోహర్ వేగంగా వెళ్ళిపోయాడు.

ఓ తుఫాన్ వెలిసినట్లు - ఓ పెనుగాలి బలంగా తనని అల్లుకుని - చుట్టేసి - ఓ క్షణం ఉక్కిరిబిక్కిరి చేసి వదిలేసి వెళ్ళిపోయినట్లు - యిపుడెంతటి శూన్యం - ఓ తీయటికల కరిగినట్లు - ఓ మధుర స్వప్నం తొణికినట్లు - మృష్టాన్న భోజనం చేతిదాకా వచ్చి నోటి కందకుండా పోయినట్లు.

మృదుల మనోహర్ వదిలేసి వెళ్ళిన ఆ శూన్యంలో - చీకటిలో - అలానే చాలాసేపు కూచుంది. తన కూతురు ఆడుకుని - అలసి-యింటికి వచ్చి గుర్తు చేసే వరకూ తను చీకటి కౌగిట్లో ఉన్నట్లు ధ్యాసే లేదు మృదులకు.

☆☆☆

భోజనాల దగ్గిర కూచుంటున్నప్పుడు రాజశేఖర్ వచ్చాడు పూర్నించి.

"తొందరగా వచ్చేశారే, క్యాంప్ పదిహేను రోజులన్నారు" మృదుల గొంతులో ఆశ్చర్యంతో

పాటు మిళితమైన సన్నని నిరుత్సాహం.

"మధ్యలో మరో ఎసైన్‌మెంట్ దొరికింది మృదులా. రేపే వెళ్ళాలి. మరో ఇరవై రోజుల వరకూ రావడానికే వీలు కుదరక పోవచ్చు. అందుకే ఓసారి వచ్చి మిమ్మల్ని చూసి, చెప్పి పోదామనిపించింది".

మృదుల కళ్ళు వజ్రపుతునకల్లా మెరవటం రాజశేఖర్ గమనించలేదు.

భోజనాలయాక, వంటగదంతా సర్ది వచ్చేప్పటికే రాజశేఖర్ గురక పెట్టి నిద్రపోతున్నాడు. అసహనంగా చూసిందతని వైపు మృదుల. నిరసనా, నిర్లక్ష్యమూ నింపుకున్న చూపు - పొట్టిగా, ఐదడుగుల నాలుగంగుళా లపొడవు - బండపెదాలు - నల్లని శరీరచ్ఛాయ - బలహీనమైన శరీరం - మనసు త్రక్కెడలో మనోహర్ రాజశేఖర్‌ల తూకం జరిగిపోతోంది.

అనాయాసంగా ఓ వేడి నిట్టూర్పు వెలువడింది. అందులోని అసహ్యానికే శక్తివుంటే అది రాజశేఖర్‌ని నామరూపాల్లేకుండా మసి చేసి ఉండేది.

రాజశేఖర్ పక్కన సర్దుకుని అతని వైపు వీపుతిప్పి పడుకుంది. రేపటి గురించి తీయటి ఆలోచనలు వస్తున్నాయి. సినిమా హీరోలా వుండే మనోహర్ కౌగిట్లో కరిగి తన జన్మ తరించిపోయే రోజు. తన అందానికి నిజమైన సార్థకత లభించే రోజు. ఓహ్! ఇంకెన్ని గంటలు విరహతాపాన్ని భరించాలో - మృదులకు మాగన్నుగా నిద్రపట్టింది.

ఓ ఎత్తైన అభేధ్యమైన కోటలో రత్న ఖచిత సింహాసనం మీద ధగద్ధగాయమానంగా మెరిసే కిరీటం ధరించి తను కూచుని ఉంది. యింతలో రణగణధ్వని. కనుమూసి తెరిచేంతలో కోటగోడల్ని చీల్చుకుంటూ ఓ ధవళాశ్వాన్ని అధిరోహించి, చేతిలో తళ తళా మెరిసే కత్తి ఝుళిపిస్తూ మనోహర్ ప్రవేశించాడు. అతని తలమీద నీలాలు పొదిగిన కిరీటం ఉంది.

మృదుల పరుగెత్తుకుంటూ వెళ్ళి గుర్రం మీద కూచుని మనోహర్‌ని బలంగా కౌగిలించుకుంది. కోటగోడలు ఒకటొకటిగా పెద్ద విస్ఫోటంతో విరిగిపడిపోతున్నాయి. తను ఎక్కిన గుర్రం గాల్లోకి ఎగిరింది. అప్పుడు చూసింది తను. రాజశేఖర్ రక్తసిక్తమైన శరీరంతో

"మృదులా - మృదులా" అని పిలుస్తూ పరుగెత్తుకు వస్తున్నాడు. తను కసిగా చూస్తోందతనివైపు. అప్పుడే పగిలిన గోడ రాళ్ళతో కప్పేసిందతన్ని. మనోహర్ పకపకా నవ్వుతున్నాడు. ఆ నవ్వులో రాజశేఖర్ మూల్గు అస్పష్టంగా విన్పిస్తోంది.

మృదుల అకస్మాత్తుగా కళ్ళు తెరిచింది. రాజశేఖర్ మూల్గు విన్పిస్తోంది. అది కలో నిజమో నిర్ధారించుకోడానికి కొన్ని నిముషాలు పట్టింది మృదులకు. రాజశేఖర్ నిజంగానే మూల్గుతున్నాడు.

రాజశేఖర్‌ని తాకి చూసింది. వళ్ళు పెనంలా కాలిపోతోంది.

"యింకా నిద్రపోలేదా మృదులా" బలవంతంగా కళ్ళు తెరిచి అడిగాడు రాజశేఖర్.

"మీ వళ్ళు కాలిపోతోందండీ...నాతో ఒక్కమాటైనా చెప్పలేదు - ఉండండి. పాలు వెచ్చ చేసుకువస్తాను. క్రోసిన్ ఉందేమో చూస్తాను".

లేవబోతున్న మృదులను ఆపాడు.

"వద్దు మృదులా నాకేం కాలేదు. నీవు నిద్రపో. నా క్యాంప్‌ల మూలంగా యింటిపనీ, బైటిపనీ, పాప అవసరాలూ అన్నీ నీవే చూసుకోవాల్సిన అగత్యం ఏర్పడింది. యిలా నిద్ర సరిగా లేకపోతే ఆరోగ్యం చెడిపోతుంది".

అతని కళ్ళలో గులాబి రేకుల్లా మృదువైన అనురాగం - మృదుల శరీరాన్ని తాకి మహాగ్ని గుండంలా మండుతోంది.

భరించలేనట్లు లేచింది విసురుగా - వంట గదిలోకి వెళ్ళి పాలు వేడిచేసుకుని వచ్చింది.

భర్త నుదుటిమీద చేయి వేసి చెప్పింది.

'రేపు ఎక్కడికీ వెళ్ళటానికి వీల్లేదు. మనం డాక్టర్ దగ్గిరకెళ్దాం."

"కుదరదు మృదులా - రేపు తప్పకుండా పోవాలి. మన అదృష్టంకొద్దీ ఆ అసైన్‌మెంట్ నాకొచ్చింది. బాగా ఆర్డర్స్ దొరికే అవకాశం ఉన్న ఏరియా - రేపు నేను పోలేక పోతే మరొకర్ని పంపిస్తారు'.

"పంపించనీయండి, మీరు జ్వరం తగ్గే వరకు రెస్ట్ తీసుకోండి."

"అలా రెస్ట్ తీసుకుంటే మనకు డబ్బు లెలా వస్తాయి మృదులా - నాకు మాత్రం ఉండదా - అందరికీ మల్లే సుఖపడాలనీ - భార్యతో పిల్లల్తో హాయిగా కాలం గడపాలని. ఈ సంవత్సరం మంచి ప్రోగ్రెస్ చూపిస్తే ప్రమోషన్ వచ్చే అవకాశాలున్నాయి. వచ్చేదాంతో సంతృప్తిపడితే రేపు మన పాప భవిష్యత్తేమిటని ఆలోచించావా - పిల్లల్ని కనటంలో ఆనందమూ, గొప్పతనమూ ఏమున్నాయి? వాళ్ళ భవిష్యత్తుని తీర్చి దిద్దటంలోనే అసలైన ఛాలెంజ్ ఉంది. ఒక్క ఎకనామికల్‌గానే కాదు - మోరల్‌గా - సోషల్‌గా - సైకలాజికల్‌గా - ఎమోషనల్‌గా మనం వాళ్ళకు దారి చూపాలి".

"దాని భవిష్యత్తు కేమైందిపుడు? మొదట మీ ఆరోగ్యం ముఖ్యంకానీ" అంది మృదుల. అప్పటికే మృదుల కళ్ళు తడితో చెమ్మగిల్లాయి.

"అవన్నీ చూసుకుని కూచుంటే నా భార్యా పిల్లల అవసరాలెలా తీర్తాయి? భర్తగా నాకు కొన్ని నైతిక బాధ్యతలున్నాయి మృదులా - అవి నిన్నూ, నీ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీ జీవితాన్ని ఆనందమయం చేయటం. కానీ పిల్లలు పుట్టాక నా ఉద్దేశంలో తల్లిదండ్రుల ఏకైక బాధ్యత పిల్లల్ని ఉదాత్తమైన వ్యక్తులుగా తీర్చిదిద్ది - గొప్ప స్థితిని చేరుకోడానికి ప్రోత్సహించటమే. ఈ నైతిక బాధ్యత ముందు మిగతావన్నీ సెకండరీనే. మన జీవితంలోని సుఖాల్ని మనం కొంతైనా అనుభవించాం. ఇకముందు అనుభవించినా లేకున్నా - జీవితమంతా ముందే వున్న మన పిల్లల జీవితాల్ని చక్కదిద్దగలిగితే అంతేచాలు. కొన్ని ఉత్కృష్టమైన బాధ్యతల్ని నిర్వర్తించడంలో కొన్ని సుఖాల్ని త్యజించడం అవసరం అని నమ్ముతాను నేను" రాజశేఖర్ కొన్ని క్షణాలు ఆయాసం తీర్చుకుంటూ కళ్ళు మూసుకున్నాడు.

మృదుల మాట్లాడలేదు.

ఇన్నాళ్ళూ తనకు కన్పించి భయపెట్టిన తన కోరికల, సరదాల సమాధి మీద ఇపుడు తల గర్వంగా ఎత్తుకుని ఆకాశాన్ని అవలోకిస్తున్న గులాబిమొక్క... దానికి పూచిన గులాబిమొగ్గ... అచ్చం తన కూతురి ముఖంలా అందమైన మొగ్గ.

కళ్ళనించి ధారాపాతంగా బాధ హృదయాన్ని తొల్చుకుని ప్రవహిస్తోంది.

ఉదయం ఎంత చెప్పినా వినకుండా రాజశేఖర్ క్యాంప్‌కి వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రం ఛెస్ ఆడుతున్నపుడు ఎప్పటికి మల్లే మృదుల ఓడిపోయింది.

మనోహర్ తన సమ్మోహనమైన నవ్వును, కళ్ళలోని కొంటెతనాన్ని ఎప్పటికి మల్లే ఆ గదిలో వదిలేసి వెళ్ళి పోయాడు. తన హృది తలుపులూ, గది తలుపులూ ఆ రాత్రికి తెరిచి ఉంచడానికి - మృదుల ఆగమనం కోసం.

ఆ రాత్రి - ఎంతగానో ఎదురు చూసిన ఆ రాత్రి - మనసు యిన్నాళ్ళుగా ఆడుతున్న చదరంగంలో మృదుల గెలిచింది. ఆరోజు నుంచీ ప్రతిరోజు గెలుస్తూనే ఉంది. తన రాజశేఖర్ కట్టుకున్న నమ్మకాల బలమైన గోడల్ని చీల్చుకుని ఎవ్వరూ లోపలికిరాలేకపోయారు. ఆ కోటలో తనే మహారాణి. తన పక్కన రాజశేఖర్ - మహారాజు.

- నైతిక బాధ్యతల కిరీటం ధరించి -

- ప్రేమ సింహాసనం మీద.

● *స్వాతి సపరివార పత్రిక 25 మార్చి, 1988* ●